

సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి

- వనపర్తి, అచ్చంపేటలో ప్రజా ఆశీర్వాద సభలు
- గులాబీ బాస్‌కు స్వాగతం పలికేందుకు పక్కా ప్రణాళిక
- జనసమీకరణ చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, విప్ గువ్వల
- సీఎం కేసీఆర్ రాకతో ఉమ్మడి జిల్లాలో వేడెక్కిన రాజకీయాలు
- 'కారు' జోరుకు కొట్టుమిట్టాడుతున్న 'హస్తం'
- అభ్యర్థులెవరో తెలియక 'కమలం' నేతల్లో గుబులు

# నేడు పాలమూరుకు దళపతి

- అభివృద్ధి ప్రదాత ప్రసంగంపై ప్రజల ఆసక్తి



వనపర్తిలో గులాబీమయమైన పాలిటెక్నిక్ కళాశాల

మహబూబ్‌నగర్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అభి వృద్ధి ప్రదాత, బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమం త్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గురువారం నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో పర్యటించనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసి న భారీ బహిరంగ సభల్లో ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు.ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించిన సీఎం కేసీఆర్.. ఈ సారి నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో పర్యటించనుండడంతో ఉమ్మడి జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నా యి. అనివార్య కారణాలవల్ల నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో నిర్వహించే బహిరంగ సభ వాయిదా పడింది. ఆ వెంటనే వనపర్తి నియోజకవర్గంలో సభకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సభకోసం వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఏర్పాట్లను చేపడుతున్నారు. మండలాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు ఏర్పా టు చేసి సభకు భారీ ఎత్తున జనసమీకరణ చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అభ్యర్థులను ఇంకా ఖరారు చేయకపోవడంతో గులాబీ దళం వ్యూహాత్మకంగా ప్రచారంలో దూసుకుపోతున్నది. సాక్షాత్తు సీఎం కేసీఆరే మూడు నియోజకవర్గాల్లో పర్యటించడం.. మిగతా చోట్ల కూడా ఎన్నికల ప్రచారాలకు ముహూర్తం ఖరారు చేస్తుండడంతో విపక్షాల్లో దడ మొదలైంది. అసలు తమకు ప్రచారానికి అయినా సమయం ఉంటుందా అని విపక్షాలు ఆందోళనకు గురవుతున్నాయి. ఎన్నికలకు సరిగ్గా 35 రోజుల సమయం మాత్రమే ఉండడంతో కారు టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. బీఫారం అందుకున్న అభ్యర్థులు ప్రచారం చేపడుతున్నారు.

## ఉమ్మడి జిల్లాలో సీఎం సుడిగాలి పర్యటన..

గులాబీ బాస్ కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో సుడిగాలి పర్యటన చేపడుతున్నారు. జడ్చర్లలో ఎన్నికల శంఖారావం పూరించిన ఎనిమిది రోజుల తర్వాత అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాలోల ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ రానుండగా.. మళ్లీ మూడు రోజుల తర్వాత వరుసగా మరో మూడు నియోజకవర్గాల్లో పర్యటించబోతున్నారు. గద్వాల, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ పర్యటన ఖరారైంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు సగం నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు. నామినేషన్ల ఘట్టం పూర్తయిన తరువాత మిగతా నియోజకవర్గాలనూ చుట్టి రానున్నారు. ఎన్నికల ప్రచారం చివరి దశలో మరో విడుత ప్రచారానికి శ్రీకారం చుట్టబోతున్నారు. మూడు విడుతల్లో అన్ని నియోజకవర్గాలను కవర్ చేయడంతోపాటు ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో మరో సారి ప్రచారం చేసే అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ లోపు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు కూడా అన్ని నియోజకవర్గాల్లోని ముఖ్యమైన పట్టణాల్లో రోడ్‌షోలు చేపట్టనున్నట్లు తెలుస్తున్నది.

## జనసమీకరణకు కసరత్తు..

ముఖ్యమంత్రి కేసీఆర్ అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాల్లో పర్యటిస్తుండడంతో భారీ ఎత్తున జన సమీకరణ చేయాలని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ మేరకు వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డి స్వయంగా పార్టీ నేతలతో సమావేశమయ్యారు. అన్ని మండలాల నుంచి జన సమీకరణ చేపట్టాలని, ఇందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని సూచించారు. మండల కేంద్రాల నుంచి ర్యాలీలతో వచ్చేలా ప్లాన్ చేయాలని వివరించారు. సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణు లు సిద్ధం కావాలన్నారు. వనపర్తి ఎన్నికల ప్రచా ర సభ విజయవంతం చేసి విపక్షాలకు కండ్ల ముందే ఓటమి భయం చూపిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ చెబుతున్నారు. అచ్చంపేటలో కూడా జన సమీకరణ చేసేందుకు విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నియోజకవర్గ, మండల నేతలతో సమావేశమయ్యారు. అన్ని గ్రామాలు, మండల కేంద్రాల నుంచి భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలను తరలించాలని కోరారు. భారీ ఎత్తున బైక్ ర్యాలీలను చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సభలతో గులాబీ విజయం ఖాయంగా కనిపించాలని సూచించారు. సుమారు 80 వేల నుంచి లక్ష మందిని తరలించేందుకు టార్గెట్ పెట్టుకున్నారు.



# ముస్తాబైన వనపర్తి



వనపర్తిలో ముస్తాబవుతున్న ప్రజా ఆశీర్వాద సభా వేదిక

- గులాబీమయమైన వనపర్తి పట్టణం
- నలుదిక్కులా పార్కింగ్‌కు ఏర్పాట్లు
- కార్యకర్తల తరలింపునకు పక్కా ప్రణాళిక
- అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సింగిరెడ్డి, రావుల

వనపర్తి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వనపర్తిలో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ వస్తున్నారు. జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహిస్తున్న భారీ సభకు ప్రత్యేకత ఉన్నది. తెలంగాణ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వనపర్తి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని నాటి ఉద్యమనేత కేసీఆర్‌కు బాసటగా నిలిచిన సింగిరెడ్డికి ఉద్యమ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈమేరకు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల శంఖారావంలో మరోసారి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విజయబావుట కోసం సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభలో దిశా...నిర్దేశం చేయబోతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వనపర్తి నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉన్నది. తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉంటూ ఉమ్మడి జిల్లాలో తెలంగాణ జెండాను నిరంజన్ రెడ్డి భుజాన వేసుకున్నారు. క్రమక్రమంగా ఉద్యమం బలపడిన అనంతరం అనేక మంది నాయకులు రావడం.. రాష్ట్రం సాధించుకోవడం జరిగింది. అయితే తొలినాళ్లలో దాదాపు దశాబ్దకాలం ఒంటి చేత్తో గులాబీ జెండాను ముందుకు నడిపించిన చరిత్ర నిరంజన్ రెడ్డికే దక్కుతుంది. నాటి ఉద్యమ ప్రాధాన్యతను బట్టి సీఎం సైతం సింగిరెడ్డికి చేయూతనందించారు. 2014 ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవిలో పూర్తి కాలం పని చేశారు. అనంతరం 2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో సింగిరెడ్డి విజయాన్ని సొంతం చేసుకొని వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేస్తున్నారు. ఓటర్లు కట్టబెట్టిన మెజార్టీకి తగినట్లుగా రాష్ట్రంలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు వరుసలో నిలబెట్టారు.

## భారీ జనసమీకరణతో సభ

అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. నియోజకవర్గంలోని 7మండలాల నుంచి కార్యకర్తలు, సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను సభకు తరలించేలా ఏర్పాట్లు చేసింది. వనపర్తి మండలంతోపాటు పెబ్బేరు, శ్రీరంగాపురం, పెద్దమందడి, ఖిల్లాఘణపురం, గోపాల్‌పేట, రేవల్లి మండలాల నుంచి భారీగా కార్యకర్తల తరలింపునకు ప్రణాళిక చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని అన్ని వార్డుల నుంచి ప్రజలను సభకు రప్పించేలా పట్టణ నాయకులు,కౌన్సిలర్లకు బాధ్యతలను అప్పగించారు.

## నాలుగు వైపులా పార్కింగ్..

ప్రజా ఆశీర్వాద సభకు వచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ తగిన ఏర్పాట్లను చేసింది. ఆయా రోడ్లను అనుసరించి ఎక్కడికక్కడ వాహనాలను పార్కింగ్ చేసేలా చర్యలు చేపట్టింది. డీఎస్పీ ఆనందరెడ్డి పర్యవేక్షణలో సభాస్థలి, అలాగే వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పెబ్బేరు నుంచి వచ్చే పెద్దవాహనాలను మర్రికుంట సమీపంలో, కార్లు, ఇతర వాహనాలను బస్ డిపో వద్ద పార్కింగ్ చేయిస్తున్నారు. అలాగే గోపాల్‌పేట, ఖిల్లా ఘణపురం నుంచి వచ్చే వాహనాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, పెద్దమందడి నుంచి వచ్చే వాహనాలను రాజనగరం క్రాస్ రోడ్‌లో పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇంకా అవవసరమైతే పాత మార్కెట్ యార్డులోను వాహనాలను నిలిపే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు డీఎస్పీ ఆనందరెడ్డి వెల్లడించారు.

## గులాబీమయమైన జిల్లా కేంద్రం..

సీఎం కేసీఆర్ పాల్గొనే ఎన్నికల బహిరంగ సభకు జిల్లా కేంద్రం ముస్తాబైంది. పట్టణ కేంద్రంలోని రోడ్లన్నీ గులాబీ జెండాలతో కళకళలాడుతున్నాయి. ప్రధాన కూడళ్లు, రహదారులు గులాబీ ఫ్లెక్సీలు, జెండాలతో కమ్ముకున్నాయి. అలాగే సభ నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ మైదానాన్ని గులాబీమయం చేశారు. అలాగే పాలిటెక్నిక్ వెనక భాగంలో హెలీప్యాడ్ ఏర్పాట్లు చేశారు. ఒకే మైదానంలో హెలీప్యాడ్, సభ నిర్వహణ అన్నట్లుగా కనిపిస్తున్నది. దీని వల్ల సీఎం కేసీఆర్ వచ్చి వెళ్లడంలో పోలీస్ శాఖకు మార్గం మరింత సులభతరమవుతున్నది. ఇదిలా ఉంటే, సీఎం పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి వేర్వేరుగా పర్యవేక్షణ చేశారు. ఉదయం, సాయంత్రం అవసరమైన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని నాయకులు, పోలీసు అధికారులకు నిర్దేశం చేశారు.

## అభివృద్ధిని చూసి మళ్లీ ఆశీర్వదించండి : మంత్రి సింగిరెడ్డి

నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించాలని మంత్రి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ వనపర్తిని జిల్లా చేయడంతోపాటు పెబ్బేరులో మత్స్య కళాశాల ఏర్పాటు చేశామని, 2018 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఇంజినీరింగ్, మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి అదనంగా నర్సింగ్, వ్యవసాయ మహిళా కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలను తీసుకొచ్చామన్నారు. సమీకృత మార్కెట్, టౌన్‌హాల్, వ్యవసాయ మార్కెట్, గోదాంలు, మిషన్ భగీరథ పథకం, రహదారుల విస్తరణ చేపట్టి ఐటీ టవర్‌ను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి సింగిరెడ్డి వెల్లడించారు. 15 చెక్ డ్యాంలను పూర్తిచేసి మరో 20 చెక్ డ్యాంలకు ప్రతిపాదనలు పంపామని, నియోజకవర్గంలో లక్షా 25వేల ఎకరాలకు సాగునీరందించామన్నారు. ఈ పనులన్నీ సీఎం కేసీఆర్ తోడ్పాటునందించడం వల్లే సాధ్యమయ్యాయని, మాట ఇచ్చిన పనులన్నీ పూర్తి చేశామని వెల్లండించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించి అభివృద్ధికి బాసటగా నిలవాలని మంత్రి సింగిరెడ్డి విజ్ఞప్తి చేశారు..

# ప్రగతిపథంలో నల్లమల

- పల్లెపల్లెకూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు
- స్వరాష్ట్రంలో తొలిసారి కృష్ణమ్మ నీరు తాకిన నేల
- సాగు, తాగునీరు, విద్య, వైద్యంలో ముందడుగు
- ఎన్నికల హామీలు నిజం చేసిన సీఎం కేసీఆర్
- అచ్చంపేట లిఫ్ట్‌తో మరో కోనసీమగా మారనున్న నల్లమల

అచ్చంపేట, అక్టోబర్ 25 : దశాబ్దాల సమైక్య పాలనలో తెలంగాణ సర్వం కోల్పోయింది. ఉద్యమకారుడు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా అనూహ్యరీతిలో దూసుకెళ్లింది. తాగేందుకు దొరకని గుక్కెడు నీళ్లు.. అంతంతే విద్య, వైద్యం.. చిన్న రోగాలకే ప్రాణాలు పోయే దౌర్భాగ్యం.. రోడ్డు లేని గ్రామాలు.. వంతెనలు లేని వాగులు.. కరెం టు లేక కమ్ముకునే చీకట్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే సమైక్య పాలనలో అచ్చంపేట నియోజకవర్గ ప్రజలకు ఒరిగింది శూన్యం. కానీ ఇదంతా గతం. గడిచిన పదేండ్ల కాలం లో అచ్చంపేట పరిస్థితి మారింది. తెలంగాణలోని పల్లె జనాల్లో బతుకు మార్పు కోసమే తెలంగాణ ఆవిర్భవించింది. ఉద్యమ పార్టీ తెలంగాణలో మొదటిసారి గద్దెనెక్కడం.. కేసీఆర్ ముఖ్యమంత్రి అ య్యాక ఇప్పుడు పరిస్థితులన్నీ మారుతున్నాయి. ఎవరు అవునన్నా.. కాదన్నా అచ్చంపేట నియోజకవర్గానికి ఎంజీకేఎల్ఐ ద్వారా సాగునీరు అందడంతో పల్లెలన్నీ పాడిపంటలతో పచ్చబడ్డాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సారథ్యంలో నల్లమల అటవీ ప్రాంతం అభివృద్ధిలో పథంలో దూసుకుపోతున్నది.

## అచ్చంపేట లిఫ్ట్‌కు స్వయంగా డిజైన్ చేసిన సీఎం

2018 నవంబర్ 27న అచ్చంపేటలో ఎన్నికల బహిరంగ సభలో సీఎం కేసీఆర్ అచ్చంపేట ప్రజలకు మాట ఇచ్చారు. అచ్చంపేటకు సాగునీరు అందించి తీరుతానని ప్రకటించారు. సీఎం అచ్చంపేటకు ఎన్నికల నినాదం నిజం చేసి చూపారు. అచ్చంపేట రైతులు, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అచ్చంపేట రైతాంగానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా సీఎం అచ్చంపేట నియోజకవర్గంలోని నీటి పారుదల ప్రాజెక్టులు అయిన కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్, చిన్ననీటి పారుదల ప్రాజెక్టులపై పూర్తి సమీక్ష చేసి సాగునీరు అందని మండలాలను గుర్తించి వాటికి సాగునీరు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని 2021 మార్చి 23న చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అత్యంత వెనుకబడిన మండలాలు లింగాల, అమ్రాబాద్, పదర, బల్మూర్, అచ్చంపేట మండలాల్లోని దాదాపు 75వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అచ్చంపేట ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టును స్వయంగా సీఎం కేసీఆరే డిజైన్ చేశారు. ప్రాజెక్టులో భాగంగా మొదటి ఫేజ్– 1 పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల ఈనెల 9న పైలాన్‌ను ఆవిష్కరించి అచ్చంపేట చిరకాల ఆకాంక్షకు జీవం పోషి ఇచ్చినమాట నిజం చేశారు. పాలమూరు – రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఎదుల రిజర్వాయర్ నుంచి 25 కిలో మీటర్ల గ్రావిటీ కాల్వ నీటిని తరలించి ఉమామహేశ్వరం, చెన్నకేశవస్వామి, మద్దిమడుగు ఆంజ న్న రిజర్వాయర్లు, నిరంజన్‌షావలీ లిఫ్టు ఏర్పాటు చేసి ప్రతిగుంటకు సాగునీరు అందించే ప్రక్రియ ప్రారంభమైంది. రూ.1061 కోట్ల వ్యయంతో టెండర్ పిలువగా బృందా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టెండర్‌ను దక్కించుకున్నది. ప్రాజెక్టులో భాగంగా రిజర్వాయర్లు, లిఫ్టులకు సీఎం కేసీఆరే స్వయంగా ఈ ప్రాంతంలోని దేవుళ్ల పేర్లను నామకరణం చేశారు. అన్ని అనుకూలిస్తే ఏడాదిలోగా అచ్చంపేటకు కృష్ణమ్మ తరలిరానుంది.

## తొలిసారి కృష్ణమ్మ నీరు తాకిన నేల

ఉమ్మడి పాలనలో ఉనికి కోల్పోయిన ఎవుసం తెలంగాణ రాష్ట్రంలో పండుగలా మారింది. సాగుకు కేసీఆర్ సర్కారు సంపూర్ణ సహకారం అందిస్తోంది. రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. కాలువల ద్వారా నీళ్లు పారుతున్న పల్లెల్లో జనం సంబురంగా మురిసిపోతున్నారు. సాగునీరు రాకతో రైతుల ముఖాల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. కర్షకుల కష్టాలు తెలిసిన రాష్ట్ర సర్కారు గత ప్రభుత్వాలకు భిన్నంగా మునుపెన్నడూ లేని విధంగా రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. దీంతో దుర్భిక్ష ప్రాంతాలకు సాగునీరు అందుతోంది. దశాబ్దాలుగా కరువుతో అల్లాడుతున్న అచ్చంపేట నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు కృష్ణ జలాలు అందుతున్నాయి. ఇటీవల వర్షకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసిన ఈ ప్రాంతంలో తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో ఈ ప్రాంతాలోని చెరువుల్లోకి తగినంత నీరు చేరలేదు. ఎంజీకేఎల్ఐ మహాత్యంతో గొలుసుకట్టు చెరువులు పూర్వవైభవం సంతరించుకోగా ఒకప్పుడు వెలవెలబోయిన ఆయకట్టు భూములు ఇప్పుడు ఆకుపచ్చగా మారాయి. పచ్చగా కళకళలాడుతున్నాయి. తెలంగాణ సర్కారు వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తుండడంతోపాటు ఎంజీకేఎల్ఐ రాకతో చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరిగి బోరు బావుల కింద పంటల విస్తీర్ణం మరింత పెరిగింది. నీళ్లు పుష్కలంగా ఉండడంతో రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పండ్ల తోటలు, కూరగాయల సాగుపై దృష్టి పెట్టి రాణిస్తున్నారు.

## పరుగులు పెడుతున్న అభివృద్ధి

వలసలు, వెనుకబాటుకు గురైన అచ్చంపేట ప్రాంతం తెలంగాణ ప్రభుత్వంలో అభివృద్ధిలో పరుగులు పెడుతున్నది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అనేక రంగాలు, సంక్షేమ పథకాల్లో వేలాది కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధికి బాటలు వేశారు. ఏ గ్రామం, పల్లె, తండాలు, గూడెంలకు వెళ్లినా అభివృద్ధి కండ్లకుకట్టినట్లు కనిపిస్తోంది. వందపడకల దవాఖాన నిర్మించి ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయి. ఉప్పునుంతలలో 30పడకల దవాఖాన భవనం నిర్మించారు. పట్టణంలో 150 డబుల్‌బెడ్రూంలు నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధిలో అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుంది.రోడ్లు, విద్య, వైద్యం, సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారం అయ్యాయి. పుల్జాల–చంద్రసాగర్ కేఎల్ఐ కాల్వ పొడిగింపు పనులు కొనసాగుతున్నాయి. ఆలయాలు, చర్చీలు, మసీదులకు నిధులు కేటాయించగా పనులు కొనసాగుతున్నాయి. మరికొన్ని ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభంకావాల్సి ఉన్నది. రెవెన్యూ డివిజన్, రెండు కొత్త మండలాలు, 75 కొత్త జీపీలు ఏర్పాడ్డాయి. మరో 20 నూతన జీపీల కోసం ప్రతిపాదన డ్రాఫ్ట్ పరిశీలనలో ఉన్నది. అన్ని గ్రామాలు, పల్లెలు, తండాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది.




అచ్చంపేట పట్టణంలో నిర్మించిన ప్రాంతీయ ప్రభుత్వ దవాఖాన



అచ్చంపేట పట్టణంలో నిర్మించిన 150 డబుల్‌బెడ్రూం ఇండ్లు

# నేడు అచ్చంపేటకు సీఎం కేసీఆర్

- ఎన్నికల ప్రచారానికి అంకురార్పణ
- ఊరూరా సిద్ధమవుతున్న ప్రజానీకం
- ప్రభుత్వ విప్ గువ్వల ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- కందనూలు బీఆర్ఎస్‌లో జోష్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ గురువారం నల్లమల నియోజకవర్గం అచ్చంపేటకు రానున్నారు. ఇక్కడి నుంచే కందనూలు జిల్లాలో సీఎం కేసీఆర్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో సీఎం సభ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. కందనూలులో బీఆర్ఎస్ ఇతర పార్టీలకంటే ముందంజలో ప్రజాశీర్వాదంతో ముందుకు సాగుతోంది. తెలంగాణ సాధించిన పార్టీగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధితో ప్రజల్లో బీఆర్ఎస్‌కు అచంచల విశ్వాసం నెలకొంది. నాగర్‌కర్నూల్ జిల్లా ఏర్పాటు, మెడికల్ కళాశాల ప్రారంభంతోపాటుగా ఎంజీకేఎల్ఐ, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల, చంద్రసాగర్, రూ.2,500 కోట్లతో అచ్చంపేట లిఫ్టులాంటి అభివృద్ధి పనులు ప్రజల కండ్లముందు కనిపిస్తున్నాయి. ఇక ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత కరెంట్, కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్‌కిట్‌లాంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికీ చేరాయి. దీంతో బీఆర్ఎస్‌పై గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా ప్రజల్లో సానుకూలత కనిపిస్తోంది. ప్రతిపక్షాలు ప్రాజెక్టులను ఆపే కుట్రలకు పాల్పడటంతోపాటుగా పథకాలపై చేసిన దుష్ప్రచారాలను ప్రజలు గుర్తించారు. ఈ కారణంగా బీఆర్ఎస్, సీఎంకేసీఆర్‌పై ప్రజల్లో నమ్మకం సడలడం లేదు. ఫలితంగా గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ ఎమ్మెల్యే, ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కట్టారు. అచ్చంపేట పట్టణంలో 150మందికి డబుల్ బెడ్రూం ఇండ్లు అందించగా, 100 పడకల దవాఖాన అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా వైద్య సేవలు ఎంతో మెరుగయ్యాయి. జిల్లాగా మారడం గతంలో మహబూబ్‌నగర్ వెళ్లాల్సి వస్తుండెది. దీంతో నాడు ఒకట్రెండు రోజులు పట్టే పని ఇప్పుడు నాగర్‌కర్నూల్‌కు వెళ్లి ఒక్క రోజులోనే పని పూర్తి చేసుకొంటున్నారు. జిల్లాల పునర్విభజనతో పదర, చారకొండ కొత్త మండలాలుగా ఏర్పడగా రెవెన్యూ, పోలీసు సబ్ డివిజన్లు ఏర్పాటయ్యాయి. ఇక 75తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయి. ఇలా నల్లమల ప్రాంతంలో పాలన ప్రజల చేరువకు వచ్చింది. మిషన్ భగీరథతో తాగునీటి సమస్య శాశ్వతంగా తీరింది. గుక్కెడు మంచినీటి కోసం ఎంతో ఇక్కట్లు పడ్డ ప్రజలకు ఇప్పుడు ఎంజీకేఎల్ఐతో సాగునీరు అందుబాటులోకి వచ్చింది. అచ్చంపేట లిఫ్టు పూర్తైతే 72వేల ఎకరాల ఆయకట్టుకు సైతం సాగునీళ్లు పుష్కలంగా లభిస్తాయి. ఇక రూ.4.50కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం, రూ.100 కోట్లతో మన్ననూర్, ఈగలపెంటలో ఎకో టూరిజంలో భాగంగా కాటేజీల నిర్మాణాలు, ఉమామహేశ్వరం, మల్లెలతీర్థం ఆలయాల అభివృద్ధి, రూ.3.50 కోట్లతో ఇండోర్, ఎన్టీఆర్ స్టేడియాల్లో వసతుల కల్పన, రూ.100 కోట్లతో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు జరగడం విశేషం. ఇలా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధికి తోడు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్నారు. ప్రజలకు పథకాలు అందించడంలోనూ వ్యక్తిగత సమస్యలున్నా స్వయంగా వింటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా గడప గడపకు జీబీఆర్ పేరిట ఇంటింటికీ వెళ్తూ ప్రజల్లో ఒకడిగా కలిసిపోతున్నారు. ఈ క్రమంలో మరోసారి హ్యాట్రిక్ విజయం సాధించేలా గువ్వల ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. సీఎం కేసీఆర్ సభతో అచ్చంపేటలో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపనుంది. ఈ సభ విజయవంతానికి గువ్వల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. నియోజకవర్గం నుంచి దాదాపు లక్ష మంది హాజరు కానుండటంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం మీద సీఎం కేసీఆర్ అచ్చంపేట సభతో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు.



ఉప్పునుంతలలో నూతనంగా నిర్మించిన 30పడకల దవాఖాన